అసెంబ్లీని నడిపే పద్ధతి ఇదేనా?

- 26 ఏండ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలే
- సభా సంప్రదాయాలు కాపాడండి
- అర్ధరాత్రి వరకూ సమావేశాలా?
- గణాంకాలపై గోప్యత ఎందుకు?
- ప్రతి గ్రామంలో బెల్టుషాప్‌లా?
- విస్తరణ పేరిట ఓల్డ్‌సిటీ విధ్వంసం
- బడ్జెట్ పద్దులపై చర్చలో అక్బరుద్దీన్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): చట్ట సభల సంప్రదాయాన్ని కాపాడాలని, ప్రజాస్వామ్యబద్ధంగా సమావేశాలను నిర్వహించాలని శాసనసభలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. చట్ట సభల సంప్రదాయాన్ని, హుందాతనాన్ని పోగొట్టవద్దని అధికార పక్షానికి హితవు పలికారు. ప్రభుత్వానికి వినే ఓపిక ఉండాలని, విమర్శలను కూడా స్వీరించాలని, అదే ప్రజాస్వామ్యమని చురకలంటించారు. మంగళవారం అసెంబ్లీలో టూరిజం, అటవి, విద్య, రోడ్లు, భవనాలు, కమర్షియల్ ట్యాక్స్‌తోపాటు పలు శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై కొనసాగిన చర్చలో ఎంఐఎం తరపున అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అసెంబ్లీని నిర్వహిస్తున్న తీరును తూర్పారబట్టారు. గతంలో రోజుకు మూడు లేదా నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన డిమాండ్స్, గ్రాంట్స్ మీద మాత్రమే చర్చ పెట్టేవారని, కానీ, ఇప్పుడు ఒక్కరోజే 11 డిమాండ్లను ప్రభుత్వం చర్చకు పెట్టిందని, ఇదెక్కడి పద్ధతి? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 26 ఏండ్లుగా శాసన సభ సమావేశాల్లో పాల్గొంటున్నానని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదని చెప్పారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ సమావేశాలను కొనసాగిస్తున్నారని, చివరకు ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌ను కూడా ఎత్తేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని మండిపడ్డారు. చర్చకు పెట్టిన సబ్జెక్టుల డిమాండ్ల కాపీలను కూడా ఒకేసారి ఇవ్వడం లేదని, డిమాండ్ కాపీలను ఇవ్వకుంటే సభ్యులు ఎలా మాట్లాడుతారని నిలదీశారు. కమర్షియల్ ట్యాక్స్ అత్యంత ముఖ్యమైన సబ్జెక్టనీ, కేవలం 10 పేజీలతో జీఎస్టీ, సీఎస్టీ, వ్యాట్ వివరాలు లేకుండా కాపీలు ఇచ్చారని, గణాంకాలను ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారని నిలదీశారు.

గ్రామాల్లో బెల్ట్‌షాపుల విస్తరణ

కాంగ్రెస్ సర్కార్ మద్యపానాన్ని పెంచి పోషిస్తున్నదని, ప్రతి గ్రామంలో బెల్టుషాపులు విస్తరించాయని అక్బరుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ప్రభుత్వం ఒకవైపు తాగిస్తూ, తాగుడును ప్రోత్సహిస్తూ, మరోవైపు ప్రొహిబిషన్ అనడం ఏమిటని చురకలేశారు. మద్యపానం ఫలితంగా ప్రతి మహిళ, తల్లి, అక్క, కూతురు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా మద్యపానాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు.

ఓల్డ్‌సిటీపై ఎందుకీ ద్వేషం?

విస్తరణ పేరిట పాతనగరం నుంచి అన్నింటినీ తరలిస్తున్నారని, ఓల్డ్‌సిటీపై ఎందుకింత ద్వేషమని అక్బరుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఇప్పటికే కమిషనరేట్‌ను తరలించారని, నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను కూడా తరలించేందుకు సిద్ధమయ్యారని, ఇక సాలార్‌జంగ్ మ్యూజియాన్ని కూడా హైటెక్ సిటీకి తరలిస్తామంటారని దుయ్యబట్టారు. 'పాత నగరంలో మనుషులను బతకనిస్తలేరు, కనీసం జంతువులైనా ఉంచండి' అంటే జూ తరలింపుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జూను అక్కడే కొనసాగించాలని, అవసరమైతే మరింత అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా దవాఖాన భవనాన్ని కూల్చవద్దని కోరారు.

నామ్ దేనా ఆసాన్

కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీలకు పేర్లు పెడుతూ ప్రచారం చేసుకుంటున్నదని అక్బరుద్దీన్ చురకలంటించారు. నామ్ దేనా ఆసాన్.. కామ్ కర్నేకా పాలిటిక్స్ (పేర్లు పెట్టడం సులభం.. కానీ పనిచేసి రాజకీయాలు చేయండి) అని వ్యాఖ్యానించారు. మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం విద్య కోసం బడ్జెట్‌లో 15% నిధులు ఎందుకు కేటాయించలేదని నిలదీశారు. సొంత స్థలాలు ఉన్నచోట భవనాలను నిర్మించకుండా, గురుకులాలను అభివృద్ధి చేయకుండా ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ విపరీతంగా పెరుగుతున్నాయని, దీనిపై అధ్యయనం చేయించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రంజాన్ సందర్భంగా చిన్నారులను పనులకు కుదుర్చుకునే వ్యాపారులపై కేసులు పెట్టాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించి సన్మానించాలని, ఇంజినీరింగ్ కోర్సుల్లో అన్ని యూనివర్సిటీలకు ఒకే రూల్స్ పాటించాలని సూచించారు.

విపక్షం సభలో.. సీఎం టూర్‌లో!

- రెండుసార్లు ఢిల్లీ, ఒకసారి చెన్నై వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి
- సీఎం బాటలోనే మంత్రులూ
- తూతూమంత్రంగానే సభకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు
- మొక్కబడిగా పద్దులపై చర్చలు
- అన్ని ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాలంటే గతంలో అందరూ అటెన్షన్‌తో ఉండేవాళ్లు. ముఖ్యంగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శాసన సభ సమావేశాలు ఉన్నాయంటే సభాపక్షనేత సహా అధికార పార్టీ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరయ్యేవారు. ముఖ్యంగా బడ్జెట్ వంటి ముఖ్యమైన వాటిపై చర్చ జరుగుతున్నప్పుడు సభ్యులందరూ చర్చలో పాల్గొనాలని, నిర్లక్ష్యంగా ఉండవద్దని నాటి సభాపక్ష నేతగా కేసీఆర్ చెప్తుండేవారు. అంతేకాదు, శాసనసభ సమావేశాలు ఉన్నప్పుడు ఒక్క నిమిషం కూడా ఆలస్యం కాకుండా సీఎం వచ్చేవారు. స్పీకర్ కూడా అనుకున్న సమయానికి శాసనసభను ప్రారంభించేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. స్వయంగా ముఖ్యమంత్రే సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. మంత్రుల హాజరూ అంతంత మాత్రంగానే ఉంటుంది. శాసనసభ సమావేశాలు జరుగుతున్న తీరుపైనా అనేక విమర్శలు వస్తున్నాయి. సభ వాయిదాపడ్డప్పుడు తిరిగి ప్రారంభించేందుకు చెప్తున్న సమయానికి, ప్రారంభిస్తున్న సమయానికి తేడా ఉంటున్నదని పలువురు సభ్యులు లాబీల్లో వ్యాఖ్యానిస్తున్నారు. సభలో సరైన కోరమే ఉండటంలేదని చెప్తున్నారు. ఏదో ఒకరిద్దరు మంత్రులు మినహా అత్యధికులు వారి వారి శాఖల సమావేశాలు, ప్రైవేట్ కార్యక్రమాలకు వెళ్తున్నారని, సభలో సబ్జెక్టు ఎవరిదైతే ఉంటుందో వాళ్లు తప్ప మిగిలిన వారు రావడంలేదని చెప్తున్నారు. ఒక్కొక్కసారి మంత్రులు అందుబాటులో లేకపోవడంతో ఆయా శాఖలకు సంబంధించిన ప్రశ్నలకు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానం చెప్తున్న పరిస్థితి కనిపిస్తున్నది.

సభ జరుగుతున్నా ఆగని ఢిల్లీ యాత్రలు

సభలో ప్రతపక్ష సభ్యులు నిండుగా కనిపిస్తుండగా, అధికార పక్షం నుంచి ఎప్పుడు చూసినా సగం మందికన్నా తక్కువ సంఖ్యలోనే సభ్యులు సభలో ఉంటున్నారు. ఈ నెల 12న గవర్నర్ ప్రసంగంతో శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అదే రోజు రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లిపోయారు. ఆ మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై చర్చ ఉన్నప్పటికీ, తొలిరోజు చర్చలో సీఎం పాల్గొనలేదు. 13న ఆయన ఢిల్లీలో పార్టీ పెద్దలు, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రితో భేటీ అయ్యారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఏదో ఒకసారి ఢిల్లీకి వెళ్లి వచ్చారంటే అర్థం చేసుకోవచ్చు.. కానీ, రెండోసారి మళ్లీ సోమవారం మధ్యాహ్నం సభ జరుగుతున్నప్పుడే సభ నుంచి నేరుగా విమానాశ్రయానికి వెళ్లి అక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లారు. ఒక్క సీఎం మాత్రమే కాదు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం వెళ్లారు. మంగళవారం కూడా సీఎం, ఇతర మంత్రులు హైదరాబాద్‌కు రాలేదు, శాసన సభ సమావేశాల్లో పాల్గొనలేదు. ఇది ఇప్పటివరకు జరిగిన ఢిల్లీ పర్యటనకు సంబంధించినది మాత్రమే. గత శుక్రవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి ఒకవైపు శాసనసభ సమావేశాలు జరుగుతుండగానే చెన్నైకి వెళ్లి, నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. అలా గత శుక్రవారం సగం రోజు, శనివారం పూర్తిగా శాసనసభకే హాజరుకాలేదు. ముఖ్యమంత్రి శాసనసభ సమావేశాలు జరుగుతున్న రోజుల్లో ఇన్నేసి రోజులు ఇతర రాష్ట్రాలకు వెళ్లడం, శాసనసభలో ఉండాల్సిన మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు కూడా పట్టీపట్టనట్టు వ్యవహరించడం గమనార్హం. పద్దులపై చర్చ జరిగే సందర్భంలో ఒక్కొక్కసారి అర్ధరాత్రి వరకూ సభ కొనసాగుతున్నది. ఈ సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు కనీసం కోరంనకు సరిపడ కూడా సభలో కనిపించడం లేదు. దీంతో విప్‌లు సభ్యుల కోసం తిరగడం లాబీల్లో కనిపిస్తున్నది.

30న సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

హుజూర్‌నగర్‌లో ప్రారంభించనున్న సీఎం, మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసే పథకాన్ని ప్రభుత్వం ఈనెల 30న ప్రారంభించనుంది. హుజూర్‌నగర్ పట్టణంలో భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, సివిల్‌సప్లై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు సభ, సీఎం, మంత్రుల షెడ్యూల్ ఖరారైంది. ఈ పథకాన్ని సివిల్‌సప్లై మంత్రి ఉత్తమ్ సొంత నియోజకవర్గంలోనే నిర్వహిస్తుండటం గమనార్హం. ఏప్రిల్ 1నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్‌కార్డుదారులందరికీ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయనుంది.

- ఇఫ్తార్ ఇక్కట్లు

కాంగ్రెస్ సర్కారు మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి అధికారుల ఉదాసీనత తోడవడంతో సరైన ఏర్పాట్లు చేయలేదు. రాష్ట్ర సర్కారు ఏర్పాటు చేసిన విందు కావడంతో వేల మంది తరలివచ్చారు. కానీ, అక్కడ అరకొర సౌకర్యాల మధ్య ఇలా తోపులాట తలెత్తింది. కాగా, ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరుకావాల్సి ఉండగా.. ఎమ్మెల్సీ కోడ్ నేపథ్యంలో ఈసీ అనుమతి నిరాకరించింది. దీంతో వారు హాజరు కాలేకపోయారు.

టీచర్లకు బయోమెట్రిక్ హాజరు పెట్టాలి

కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ టీచర్లకు బయోమెట్రిక్ హాజరు అమలుచేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు డిమాండ్ చేశారు. టీచర్లు స్కూళ్లకు వెళ్లడం లేదని ఆరోపించారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. కొన్ని నెలల క్రితం తాను తుంగతుర్తిలోని ఓ రెసిడెన్షియల్ పాఠశాలను విజిట్ చేసినప్పుడు జరిగిన విషయాన్ని ప్రస్తావించారు.

టీచర్లే కాపీ కొట్టిస్తున్నారు

ఎమ్మెల్యే కవ్వంపల్లి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యతా ప్రమాణాలు దారుణంగా ఉన్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. బడ్జెట్ పద్దులపై అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులు కొందరికి అక్షరాలు, లెక్కలు రాని పరిస్థితి ఉన్నదని, అయినప్పటికీ 90 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారంటే దీని వెనుక కారణం.. ఉపాధ్యాయులే విద్యార్థులతో కాపీ కొట్టించి బయటకు పంపుతున్నట్టు ఆరోపించారు.

నాకు హోంమంత్రి పదవి ఇష్టం

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగనున్న నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు హోంమంత్రిత్వ శాఖ అంటే ఇష్టమని స్పష్టంచేశారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో మంత్రి పదవిపై తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. సామర్థ్యాన్ని బట్టి మంత్రులను ఎంపిక చేయాలన్న ఆయన, భువనగిరి ఎంపీ ఎన్నికల బాధ్యతలు సమర్థంగా నిర్వహించినట్టు గుర్తుచేశారు. తనకు మంత్రి పదవి వస్తుందనే ఆశిస్తున్నట్టు తెలిపారు.

డీలిమిటేషన్‌తో ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): డీలిమిటేషన్‌తో ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగే ప్రమాదం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఏపీభవన్ ప్రాంగణంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. డీలిమిటేషన్ ద్వారా దేశాన్ని దక్షిణాది, ఉత్తరాదిగా విభజించాలని కేంద్రం కుట్ర పన్నుతున్నదని మండిపడ్డారు.

జనాభా ప్రాతిపదికన సీట్ల తగ్గింపు సరికాదు

ఏపీ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): జనాభా ప్రాతిపదికన సీట్ల తగ్గింపు సరికాదని టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి అన్నారు. మంగళవారం రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీయే కూటమిలో ఉన్నందున చంద్రబాబు, పవన్‌కల్యాణ్ దీనిపై బహిరంగంగా మాట్లాడడం లేదని తెలిపారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

కామారెడ్డి జిల్లాలో ఘటన

ఎల్లారెడ్డి రూరల్, (గాంధారి) మార్చి 25: ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా విద్యుత్తు షాక్‌తో ఓ యువ రైతు మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం రాంపూర్ గడ్డ తండాలో సోమవారం చోటుచేసుకున్నది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గడ్డ తండాకు చెందిన రైతు పిట్ల శ్రీను(30) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతుల నేపథ్యంలో సమీపంలోని పొతంగల్ కలాన్ సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకున్నాడు. అదే సమయంలో మరొకరు కూడా ఎల్‌సీ అడగడంతో సిబ్బంది విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ఒకరి పని పూర్తి కావడం, ఎల్‌సీ రిటర్న్ చేయడంతో సబ్‌స్టేషన్ సిబ్బంది కరెంటు సరఫరా చేయడంతో అప్పటికే స్తంభంపై మరమ్మతులు చేస్తున్న పిట్ల శ్రీను విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. స్థానికులు బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తండావాసులు మృతదేహాన్ని పోతంగల్ కలాన్ సబ్‌స్టేషన్ వద్ద ఉంచి ఆందోళనకు దిగారు.

3న మంత్రివర్గ విస్తరణ!

- ఇద్దరు మంత్రుల తొలగింపు.. ఆరుగురికి కొత్తగా అవకాశం?
- రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్, వాకిటి శ్రీహరికి ఇచ్చే చాన్స్
- ఓ మహిళా మంత్రి స్థానంలో విజయశాంతికి అవకాశం
- మైనార్టీ కోటాలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ పేరు పరిశీలన
- ఏడుగురు మంత్రుల శాఖలు మారే అవకాశం



హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గ విస్తరణకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైనట్టు తెలిసింది. ఏప్రిల్ మూడున కొత్త మంత్రులు ప్రమాణం చేస్తారని గాంధీభవన్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. మంత్రివర్గ విస్తరణతోపాటు పునర్వ్యవస్థీకరణ కూడా జరుగవచ్చని పేర్కొన్నాయి. తుది ఎంపికపై కసరత్తు జరుగుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం మంత్రివర్గం కోటాలో ఆరు ఖాళీలు ఉండగా.. 30 మంది ఆశావహుల పేర్లను అధిష్ఠానానికి పంపినట్టు తెలిసింది. అయితే మొత్తం ఆరు ఖాళీలను భర్తీ చేస్తారా లేక నాలుగింటితో సరిపెడతారా అన్నదానిపై స్పష్టత రాలేదు. మంత్రిపదవులను ఆశించి భంగపడిన వారిని ఊరించేందుకు రెండు స్థానాలను ఖాళీగా ఉంచే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఆ రెండు బెర్తులను ఎరగా చూపించి అసంతృప్తి జ్వాలలను చల్లార్చవచ్చన్నది ఎత్తుగడగా భావిస్తున్నారు.

ఫ్యామిలీ ప్యాక్ బొనాంజా..

ఏఐసీసీ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు ప్రస్తుత మంత్రివర్గం నుంచి ఇద్దరిని తొలగించి, మొత్తంగా ఆరుగురిని కొత్తగా చేర్చుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు గాంధీభవన్ వర్గాలు లీకులు వదులుతున్నాయి. ఉద్వాసనకు గురయ్యేవారిలో వరంగల్ జిల్లాకు చెందిన మహిళామంత్రితోపాటు, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మరో మంత్రి కూడా ఉన్నట్టు ఆ లీకుల సారాంశం. ఇక కొత్తగా చేరేవారిలో నల్లగొండ జిల్లా నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుంచి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్లు వినిపిస్తున్నాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన భార్య పద్మావతికి మంత్రి పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నట్టు తెలిసింది. ఆమెను డిప్యూటీ స్పీకర్‌గానైనా నియమించాలని, తనకు రెవెన్యూ లేదా ఆర్థిక శాఖ ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు తెలిసింది. ఇందుకు అధిష్ఠానం సానుకూలంగా స్పందించినట్టు సమాచారం.

ముఖ్యనేతను కాదని శ్రీహరికి...

బీసీ సామాజిక వర్గం నుంచి మహాబూబ్‌నగర్ జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేరును ఖరారు చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. మైనార్టీ కోటాలో ఎమ్మెల్సీ అమీర్‌అలీఖాన్ పేరును పరిశీలిస్తున్నట్టు సమాచారం.

లిక్కర్ రింగ్ లీడర్‌కు ముఖ్యనేత దన్ను

ఇటీవల బీర్ల ధరలో పెంపులో చక్రం తిప్పిన ఉత్తర తెలంగాణకు చెందిన మరో నేత పేరును మంత్రిపదవి కోసం ముఖ్యనేత ముందుకు తెచ్చినట్టు కాంగ్రెస్ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. ఆయనకు కోసం ముఖ్యనేత కొన్ని త్యాగాలు, ఇంకొన్ని రాజకీయ ఎత్తుగడలతో వ్యూహ రచన చేసినట్టు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతున్నది.

ఏడుగురి శాఖల మార్పు

మంత్రివర్గ విస్తరణలో ఏడుగురు మంత్రుల శాఖలు మారుతాయని గాంధీభవన్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, మెదక్ జిల్లాకు చెందిన మరో మంత్రి ఈ జాబితాలో ఉన్న విషయం తెలిసిందే. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తే ఆయన సోదరుడు వెంకట్‌రెడ్డి శాఖలను మార్చే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల శాఖను కూడా మార్చే ఆలోచన ఉన్నట్టు సమాచారం. మరో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మరిన్ని శాఖలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతున్నది. మంత్రి సీతక్కకు పంచాయతీరాజ్ శాఖను తొలిగించి మరో శాఖను అప్పగిస్తారనే ప్రచారం జరుగుతున్నది.

ఆమె ఔట్.. రాములమ్మ ఇన్

వరుస వివాదాలతో వార్తల్లోకి ఎక్కిన వరంగల్ జిల్లాకు చెందిన మహిళా మంత్రిని క్యాబినెట్ నుంచి తప్పిస్తారని ప్రచారం జరుగుతున్నది. ఓ సినీ నటుడి కటుంబంతో ఏర్పడిన వివాదంపై అధిష్ఠానం ఆమె పట్ల అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేతో సదరు మంత్రికున్న విభేదాలు రచ్చకెక్కాయి. ఆమె స్థానంలో తనకు అవకాశం ఇవ్వాలని దొంతి మాధవరెడ్డి కోరుతున్నారు. కానీ సామాజికవర్గాల సర్దుబాటులో ఆయనను చేర్చుకోవటం సాధ్యం కాదని స్పష్టం చేసినట్టు సమాచారం. మధ్యేమార్గంగా అదే జిల్లాకు చెందిన మున్నూరు కాపు నేత, ఎమ్మెల్సీ విజయశాంతి పేరును అధిష్ఠానం తెరపైకి తెచ్చినట్టు తెలిసింది. నిజానికి టీపీసీసీ రూపొందించిన 30 మంది ఆశావహుల జాబితాలో ఆమె పేరు లేదు. విజయశాంతి స్వస్థలం ములుగు జిల్లాలోని రామన్నగూడెంగా చెప్తున్నారు.

బెట్టింగ్‌కు యువకుడి బలి

- మేడ్చల్ జిల్లాలో విషాదం

మేడ్చల్, మార్చి 25: క్రికెట్ బెట్టింగ్‌కు ఓ యువకుడు బలయ్యాడు. రూ.లక్ష నష్టపోయి, మనస్తాపానికి గురైన గుండ్లపోచంల్లికి చెందిన సోమేశ్ (29) రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గౌడవెల్లి పరిధిలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఏపీలోని అనకాపల్లి జిల్లా చోడవరం మండలం భోగాపురానికి చెందిన రమణ 25 ఏండ్ల కిందట గుండ్లపోచంల్లికి వలస వచ్చారు. ఆయన కుమారుడు సోమేశ్ (29) దేవరయాంజాల్‌లోని ఓ సంస్థలో పని చేస్తున్నాడు. సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో బెట్టింగ్ పెట్టిన సోమేశ్ రూ.లక్ష పోగొట్టుకున్నాడు. అందులో కొంత సంస్థకు చెందిన సొమ్ము కూడా ఉంది. దీంతో మనస్తాపానికి గురై గౌడవెల్లి పరిధిలోని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, నాలుగేండ్ల కిందట తన అక్క పెండ్లి కోసం తీసుకొచ్చిన రూ.3 లక్షలను సోమేశ్ బెట్టింగ్‌లో పోగొట్టాడు. కుమారుడు ఏమైనా అఘాయిత్యానికి పాల్పడకూడదని తల్లిదండ్రులే అప్పులు తీర్చారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

టన్నెల్‌లో మరో మృతదేహం వెలికితీత

- యూపీకి చెందిన ఇంజినీర్ మనోజ్‌కుమార్‌గా నిర్ధారణ
- ఎస్ఎల్‌బీసీ వద్ద 33 రోజులకు రెండో మృతదేహం గుర్తింపు
- బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు అందజేత

అచ్చంపేట, మార్చి 25 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం లభ్యమైంది. సొరంగం 13.5 కిలోమీటర్ వద్ద కన్వేయర్ బెల్టు నుంచి 40 మీటర్ల దూరంలో శిథిలాల కింద సోమవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో తవ్వకాలు జరుపుతుండగా, దుర్గంధం రావడంతోపాటు మృతుడికి సంబంధించిన కాళ్లు కనిపించాయి. మంగళవారం మధ్యాహ్నం సమయంలో మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. టీబీఎం మెషిన్ కిందిభాగంలో శిథిలాల కింద ఇరుక్కొని ఉండటంతో పరికరాలను గ్యాస్‌కట్టర్ ద్వారా తొలగించి బయటకు తీశారు. మృతదేహంపై ఉన్న ఆనవాళ్లను నమోదు చేశారు. యూపీకి చెందిన ఇంజినీర్ మనోజ్‌కుమార్‌గా అధికారులు నిర్ధారించారు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఉత్తరప్రదేశ్‌కు పంపించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించారు. గురుప్రీత్‌సింగ్ శవం లభించిన ప్రదేశానికి.. రెండో మృతదేహం లభించిన ప్రదేశానికి దాదాపు 200 మీటర్ల దూరం ఉంటుందని సింగరేణి జనరల్ మేనేజర్ బైద్య తెలిపారు.

మిగిలిన ఆరుగురి కోసం అన్వేషణ..

టన్నెల్‌లో ఇద్దరి శవాలు దొరకగా, మిగిలిన వారి మృతదేహాల కోసం అన్వేషణ కొనసాగుతున్నది. క్యాడవర్ డాగ్స్, మినీ జేసీబీలు, ఇతర యంత్రాలు, రెస్క్యూ బృందాలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయి. రాష్ట్ర విపత్తు నిర్వాహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సహాయక చర్యల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

బోరు ఇంకిపోయిందని..

- రైతు ఆత్మహత్యాయత్నం
- వనపర్తి జిల్లాలో ఘటన

పెబ్బేరు, మార్చి 25 : బోరు ఇంకిపోయిందని మనస్తాపం చెందిన యువ రైతు ఆత్మహత్యకు యత్నించిన ఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. పెబ్బేరు మండలం అయ్యవారిపల్లెకు చెందిన శ్రీకాంత్ (35) వ్యవసాయం చేస్తున్నాడు. ఆరెకరాల్లో బత్తాయి తోట సాగు చేశాడు. ఇటీవల శ్రీకాంత్ పక్క పొలానికి చెందిన రైతు బోరు డ్రిల్ చేశాడు. దీంతో తో